రౌడీయిజం కావాలా? ప్రజాస్వామ్యం కావాలా..?



మదనపల్లెలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా చంద్రబాబు నాయుడు

- పాపాల పెద్దిరెడ్డి దుర్మార్గ పాలన
- ఉదయం శాండ్.. మధ్యాహ్నం మైనింగ్.. రాత్రి ప్రాజెక్టులు తింటాడు
- ఆరోజు నేను అనుకుంటే వీరు బయట తిరిగేవారా?
- హంద్రీ-నీవాను గాలికొదిలేశారు
- బీటీ కళాశాల ఆస్తులకు టెండర్ వేశారు
- మదనపల్లెను జిల్లా చేస్తా
- షాజహాన్‌బాషాను గెలిపించండి
- మదనపల్లె ప్రజాగళంలో చంద్రబాబు





బహిరంగ సభకు హాజరైన జనం

మదనపల్లె, మార్చి 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాపాల పెద్దిరెడ్డి దుర్మార్గ పాలన నడుస్తోందని, రౌడీయిజం, కబ్జాలతో పాలన చేస్తున్నారని, వీరి రౌడీయిజం కావాలా.. ప్రజాస్వామ్యాన్ని కాపాడే టీడీపీ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం మదనపల్లెలోని బెంగళూరు బస్టాండులో ప్రజాగళం బహిరంగ సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా, కొడుకు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీగా, తమ్ముడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఎవరిస్థాయిలో వారు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వీరికి అన్నమయ్య జిల్లాను పవర్ ఆఫ్ పట్టా రాసిచ్చారా? అంటూ ప్రశ్నించారు. పెద్దిరెడ్డి నిద్ర లేచినప్పటి నుంచీ అన్నం మానేసి ఉదయం శాండ్, మధ్యాహ్నం మైనింగ్, రాత్రివేళలో ఇరిగేషన్ ప్రాజెక్టులు మాత్రమే తింటాడని చంద్రబాబు విమర్శించారు. జిల్లాలో తాను ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిశీలనలో వీరి అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే...తనపైనే అంగళ్లు, పుంగనూరులో అక్రమ కేసులు పెట్టించారని గుర్తు చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులూ, కాంట్రాక్టులు, పనులూ అన్నీ వీరికేనా? అంటూ ప్రశ్నించారు. మదనపల్లె ఏరియాలో వీరి దెబ్బకు 25 గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలు మూతపడటంతో పాటు అన్ని రకాల వ్యాపారాలు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో ఎంతోమంది కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. జిల్లా నుంచి ఇసుకను బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు.

హంద్రీ-నీవాను పూర్తి చేయకుండా గాలికొదిలేసిన పెద్దిరెడ్డి దీనికి సమాంతరంగా రూ.6 వేల కోట్లతో గాలేరు-నగరి ప్రాజెక్టు నుంచి పైపులైన్ మంజూరు చేయించుకున్నారని తెలిపారు. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె వద్ద అనుమతి లేకుండా రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుని ప్రాజెక్టులు కడుతున్నట్లు చెప్పిన చంద్రబాబు దీనిపై రైతులు కోర్టును ఆశ్రయిస్తే ఎన్‌జీటీ రూ.25 కోట్లు జరిమానా విధించినట్లు తెలిపారు. ఆవులపల్లె వద్ద అనుమతి లేకుండా ప్రాజెక్టు నిర్మిస్తూ రూ.600 కోట్లు దోచుకున్నట్లు ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 25 ప్రాజెక్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ఆరోజు నేను అనుకుని ఉంటే, వీరంతా బయటకు వచ్చేవారా? అంటూ ప్రశ్నించారు. మీకు రౌడీయిజం కావాలా? ప్రజాస్వామ్యం కావాలా? మీ ఆస్తులకు రక్షణ ఉంటుందా? మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు.

మదనపల్లెను జిల్లా చేసే బాధ్యత నాది

అన్ని అర్హతలున్న బ్రిటీష్ కాలం నాటి మదనపల్లెను జిల్లా చేయాల్సింది. కానీ వైసీపీ నాయకుల స్వార్థానికి ఇక్కడ ప్రజల ఆకాంక్ష నెరవేరకుండాపోయింది. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లా చేసే బాధ్యత నాది అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. అబ్బా, కొడుకుల దోపిడీకి మదనపల్లె కావాలి..అభివృద్ధికి మాత్రం కాదన్నారు. ఇలాంటి స్వార్థ పరులను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతులకు ఇచ్చే లీటరు పాలలోనూ రూ.2 కొట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హంద్రీ-నీవా పూర్తి చేస్తాం

హంద్రీ-నీవాను పూర్తి చేయడంతో పాటు మదనపల్లె దాహార్తికి నిర్మించిన సమ్మర్‌స్టోరేజీ(ఎస్ఎస్)ట్యాంకులు పూర్తి చేసి, పట్టణానికి 24 గంటలూ తాగునీరు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులన్నీ కబ్జా చేస్తున్నారని, రానున్న రోజుల్లో వాటిని రక్షించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. మదనపల్లెలో బీటీ కళాశాల ఆస్తుల స్వాహాకు కూడా వైసీపీ నాయకులు టెండర్ వేశారని, పట్టణంలో విలువైన అయిదెకరాలు విద్యుత్తుశాఖ ఉద్యోగుల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు అధినేత ఆరోపించారు. తమ హయాంలో హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఇది సాక్షి పత్రికకు ఇచ్చిన అడ్వర్టజ్‌మెంటుకు చేసిన ఖర్చు కంటే తక్కువేనని ఎద్దేవా చేశారు. కానీ అయిదేళ్లలో ఒక టీఎంసీ నీరు కూడా తేలేకపోయారని విమర్శించారు.

షాజహాన్‌బాషాను గెలిపించండి

మైనార్టీలు ఎక్కువగా ఉన్న మదనపల్లెలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా షాజహాన్‌బాషాను గెలిపించాలని కోరిన చంద్రబాబు..మీకు ఏం కావాలో మేం చేస్తామని ఇక్కడి ప్రజలను కోరారు. ఎన్ఆర్‌సీని సమర్థించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి..ఇక్కడ దొంగాట ఆడుతున్నారని కుండబద్దలు కొట్టారు. మైనార్టీలకెవరికీ అన్యాయం జరగదని, మేమందరం ఉన్నామని భరోసా ఇచ్చారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే టీడీపీ ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించినట్లు చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమానికి తాము ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటికి మంగళం పాడిందని చెప్పారు. ఇందులో భాగమే మదనపల్లెలో కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న షాదీమహల్ నిర్మాణమన్నారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం ఏం చేసిందో..ఈ అయిదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా? అంటూ వైసీపీని ప్రశ్నించారు.

నేనెప్పుడూ ఇంత స్పందన చూడలేదు

వివిధ సందర్భాలు, వివిధ హోదాల్లో నేను ఎన్నోసార్లు మదనపల్లెకు వచ్చినా.. ఇంత స్పందన ఎప్పుడూ చూడలేదని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. తనకు అఖండ స్వాగతం పలికిన ప్రజలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రం దశ, దిశ మార్చేందుకు, ప్రజలను చైతన్యం చేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు స్పష్టం చేశారు. మీలోని ఉత్సాహం, ప్రభుత్వంపై కసి, ఆవేశం చూస్తే, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని, సైకో జగన్‌ను చిత్తుగా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్న అధినేత మాటలకు ప్రజలు, ముఖ్యంగా యువత జేజేలు పలికారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలిరోజు మూడు సమావేశాలూ హిట్ అయినట్లు చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే 47 రోజులు..7 వారాలూ ఇదే ఉత్సాహంతో ఉంటూ, అరాచక వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ పలకాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. మదనపల్లెలో గంజాయి ఉందా? లేదా? అంటూ ప్రశ్నిస్తే..ఉందంటూ సమాధానం వచ్చింది. వాణిజ్య పంటగా కూడా సాగు చేస్తున్నారని, వైసీపీ అధికారంలోకి వచ్చాక..బయటి రాష్ట్రాలు, బయటి దేశాల నుంచి రవాణా చేస్తున్నారంటూ ఆరోపించారు. 1975 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నా, మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశా, ఇదే జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా సీఎంగా పనిచేశారు.. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ఇలాంటి దారుణమైన పరిస్థితులు ఎప్పుడైనా చూశారా? అంటూ ప్రశ్నించారు.

అసెంబ్లీలన్నీ గెలిచి.. అధినేతకు గిఫ్ట్‌గా ఇద్దాం

రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ జెండా ఎగురేసి, అధినేత చంద్రబాబునాయుడుకు గిఫ్ట్‌గా ఇద్దామని పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. ప్రజాగళం ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబుతో కలసి జగన్‌మోహన్‌రాజు పాల్గొని ప్రసంగించారు. మదనపల్లె ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లెలోనే కాదు జిల్లాలో అరాచక పాలనకు స్వస్తి పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రజలకు పెద్దిరెడ్డి కుటుంబం ఏం చేసిందని ప్రశ్నించారు. మదనపల్లెలో ఎవరూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, నేనున్నానంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ఉన్న ఎన్‌డీఏ అవసరాన్ని వివరిస్తూ, ఈ సాధారణ ఎన్నికల్లో వైసీపీ మాఫియాను మట్టి కరిపించాలని సూచించారు.

పుత్తూరు నుంచి అధినేత చంద్రబాబునాయుడు సాయంత్రం 5:30 గంటలకు స్థానిక బీటీ కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, ఎస్.ఎ.మస్తాన్, పార్టీ శ్రేణులు అధినేతకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో 7 గంటలకు బెంగళూరు బస్టాండులోని సభాస్థలికి చేరుకున్నారు. అనంతరం 7:25 నుంచి 8:25 గంటల వరకూ గంటపాటు ప్రసంగించారు. అనంతరం అక్కడి నుంచి పుంగనూరు రోడ్డులోని శ్రీరామకాంప్లెక్స్ అతిథిగృహానికి చేరుకుని, పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అక్కడే రాత్రి బస చేయగా గురువారం ఉదయం 11 గంటలకు శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా రాప్తాడు బయలుదేరనున్నారు.

సభ సక్సెస్.. జన నీరాజనం

అధినేత చంద్రబాబునాయుడు మదనపల్లెలో అడుగుపెట్టినప్పటి నుంచి సమావేశం ముగిసే వరకూ ప్రజలు నీరాజనం పలికారు. హెలిప్యాడ్‌లో ఘనస్వాగతం అనంతరం సభాస్థలికి కాన్వాయ్‌లో బయలుదేరిన అధినేతకు బెంగళూరు రోడ్డు వెంబడి ప్రజలు, పార్టీశ్రేణులు బ్రహ్మరథం పట్టారు. రోడ్డు వెంట బారులు తీరిన ప్రజలకు అభివాదం చేస్తూ అధినేత ముందుకు కదిలారు. గంటకుపైగా ప్రసంగించిన చంద్రబాబుకు ప్రజలు ముఖ్యంగా యువత జేజేలు పలికారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే పట్టణానికి చేరుకున్న అధినేత..నిర్దేత సమయానికే సమావేశం ముగించి ముందుకు కదిలారు. సమావేశంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి అభ్యర్థులు ఎం.షాజహాన్‌బాషా, డి.జయచంద్రారెడ్డి, ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి, చల్లా బాబురెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ సీనియర్ నేత బొమ్మనచెరువు శ్రీరాములు, తంబళ్లపల్లె టీడీపీ నేతలు కొండా నరేంద్ర, సీడ్ మల్లికార్జుననాయుడు, ఉమ్మడి జిల్లాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పార్టీశ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.







టీడీపీ కార్యకర్తల ఆనందోత్సాహం







యువగళం బహిరంగ సభలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పీలేరు అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, మదనపల్లె అభ్యర్థి షాజహాన్‌బాషా

రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- పోతుపేటలో విషాదఛాయలు

పెద్దతిప్పసముద్రం, మార్చి 27: పీటీఎం మండలం కుమ్మరవారిపల్లె వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీటీఎం మండలం పోతుపేట గ్రామానికి చెందిన రమణ ములకలచెరువు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన కుమారుడు సాయిచరణ్ (16) బి.కొత్తకోటలోని ఓ ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం బి.కొత్తకోటలో పదో తరగతి ఆఖరి పరీక్ష రాసే క్రమంలో ఉదయం 7 గంటలకు బి.కొత్తకోటకు తన ద్విచక్రవాహనంలో వచ్చాడు. కాగా బి.కొత్తకోటకు చెందిన తన స్నేహితుడైన వెంకటేష్ (వెంకీ) తన తాత మద్దయ్యగారిపల్లె సమీపంలో కూలీ పనులకు వెళ్లడంతో అతనికి అన్నం ఇచ్చేందుకు ఇద్దరు కలసి ద్విచక్రవాహనంలో బి.కొత్తకోట నుంచి బయలుదేరి వెళ్లారు. పీటీఎం మీదుగా వెళ్లి కుమ్మరవారిపల్లె సమీపంలోకి వెళ్లగానే అటువైపు నుంచి కాట్నగల్లుకు చెందిన నరసింహులు (34), శ్యాంకుమార్ (28)లు వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. పక్కనే పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్న మహిళలు అక్కడికి చేరుకుని 108 వాహనానికి సమాచారం అందించడంతో పీటీఎం 108 సిబ్బంది వారిని హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయిచరణ్‌ను మదనపల్లెకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

తీవ్రంగా గాయపడిన కాట్నగల్లుకు చెందిన నరసింహులు, శ్యాంకుమార్‌లను తిరుపతికి రెఫర్ చేశారు. వెంకటేశ్ మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పదో తరగతి చదువుతున్న సాయిచరణ్ మృతితో పోతుపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోతుపేటలో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యార్థి సాయిచరణ్‌కు కన్నీటితో నివాళులర్పించారు. ప్రమాదంపై పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.





మృతి చెందిన సాయిచరణ్ (ఫైల్)

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కొరడా

- జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లో పర్యవేక్షణ...
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 27: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై 583 ఫిర్యాదులు అందగా 564 పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి రకరకాల ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 583 ఫిర్యాదులు అందగా 564 పరిష్కరించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 61.10 లక్షల విలువైన నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. ఇందులో 26.81 లక్షల మేరకు నగదు, 14.89 లక్షల విలువైన మద్యం, 1.40 లక్షల విలువైన గంజాయి, 17.90 లక్షల విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం..

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో సీ-విజిల్, ఈఎస్ఎంఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫామ్స్ 6, 7, 8ఏ, ఎన్‌కోర్, సీవిజిల్ తదితర అంశాలపై ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

పుట్టెడు దుఃఖంతో పది పరీక్షకు..

- ఒక పక్క విషాదం.. మరోపక్క భవిష్యత్తు
- పది పరీక్షలు రాసిన విద్యార్థిని

మదనపల్లె అర్బన్ మార్చి 27 : ఇంట్లో తండ్రి మృతదేహం బడిలో భవిష్యత్తు నిలిపే పదో తరగతి పరీక్షలు ఎటూ తేల్చుకోలేని విద్యార్థిని రమ్య దుఃఖాన్ని దిగమింగుకుని మదనపల్లెలో పదో తరగతి పరీక్ష రాసింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె పట్టణం న్యూ బైపాస్ రోడ్డు సమీపంలోని కనకదాసునగర్‌లో నివాసముంటున్న వి.గణపతి (43) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. ఇతను 20 సంవత్సరాలుగా చేనేత కార్మికుడిగా మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతడికి భార్య శివమ్మ, కుమారుడు తేజు, కుమార్తె రమ్య ఉన్నారు. వీరిలో కుమార్తె రమ్య పదో తరగతి పరీక్షలు రాస్తుండగా కుమారుడు ఏడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఉన్నట్టుండి ఇంట్లో పడిపోయాడు. స్థానికుల సహాయంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా వారి స్వగ్రామమైన కాండ్లమడుగు క్రాస్ గొల్లపల్లె గ్రామం చిటిమిరెడ్డిగారిపల్లెకు మృతదేహాన్ని బుధవారం ఉదయం తీసుకెళ్లారు. కాగా తండ్రి మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంతో ఆ విద్యార్థిని చివరి పరీక్ష అయిన సోషియల్ పరీక్షకు హాజరైంది. ఆమె పరీక్ష రాసిన వచ్చిన అనంతరం దహనక్రియలు నిర్వహించారు.



చేనేత కార్మికుడు వి.గణపతి మృతదేహం




పుట్టెడు దుఃఖంతో పది పరీక్షకు హాజరైన రమ్య

క్షయవ్యాధి అంతమే లక్ష్యం..

- క్రమబద్ధంగా మందులు వాడితేనే నివారణ
- డాట్ పరీక్షతో నిర్ధారణ
- నిర్ధారణతోనే రక్షణ

కడప (మారుతీనగర్) మార్చి 27: క్షయ ఒక అంటు వ్యాధి, ఈ వ్యాధి కేవలం గాలి ద్వారానే ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. గాలిని నియంత్రించడం సాధ్యమయ్యే పనికాదు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు నోరు, ముక్కుకు అడ్డంగా రుమాలు వంటివి పెట్టుకోవడం అలవరచుకోవాలి. లేదంటే ఆ వ్యాధిగ్రస్తుడు ఒక సంవత్సర కాలంలో 10 నుంచి 15 మందికి ఆ వ్యాధిని అంటించగలడు.



1962లో జాతీయ క్షయ నిరోధక కార్యక్రమం అమలు జరిగింది. అప్పట్లో ఆ కార్యక్రమం అనుకున్న సత్ఫలితాలను ఇవ్వలేదు. పైపెచ్చు గుర్తించిన బాధితులను ఒక ప్రదేశం (మదనపల్లి-ఆరోగ్యకేంద్రం) లో ప్రత్యేక వాతావరణంలో ఉంచేవారు. అప్పట్లో (రీఫాంపసిన్, ఇతాంబుటాల్, పైరాజనమైడ్, ఐసోనియాజెడ్)7 మాత్రలు చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వేసుకోవాల్సి ఉండేది. ఆ మందుల ప్రభావం కారణంగా బాధి తులు చాలా ఇబ్బందులు పడి , మధ్యలోనే మందులను ఆపేసేవారు. ఈ పరిస్థితి దశల వారీగా సరిదిద్దిన జాతీయ క్షయ నిరోధక కార్యక్రమం మొదలు పెట్టుటకు దారితీసింది. ఈ కార్యక్రమంలో ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వల్పకాలిక చికిత్స (డీఓటీ ఎస్-డాట్స్)పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో రోగులను టెస్టింగ్ ద్వారా (గళ్ళపరీక్ష) త్వరితగతిన గుర్తించడం- గుర్తించిన వారికి అధునాతన మందులు ఇవ్వడం.. పేషెంట్ ఇంటి దగ్గరికి వెళ్ళి వారి కుటుంబ స్థితి గతులను పరిశీలించి, వారికి కూడా టెస్టింగ్‌తో పాటు, ఆ కుటుంబంలోని ఆరేళ్లలోపు పిల్లలకు కూడా మందులు ఇచ్చేవారు. దీంతో కొంతమేరకు వ్యాధిని నియంత్రించే దిశగా అడుగులు పడ్డాయి. 2018 నాటి నుంచి క్షయ వ్యాధిని పూర్తిగా లేకుండా చేయాలనే లక్ష్యతో కేంద్ర ప్రభుత్వం అడుగులు ముందుకేసింది. ఇందులో ప్రధానంగా అధునాతన టెస్టింగ్- (సీబీఎన్ఏఏటీ) క్యాటరైజ్డ్ బేసిడ్ ఆసిడ్ అంప్లిఫికేషన్ టెస్ట్)- ఆర్‌టీపీసీఆర్ -రియల్ టైమ్ పొలమోర్ చైన్ రియాక్షన్) యంత్రాల ద్వారా వ్యాధిని త్వరితగతిన గుర్తిస్తారు. వ్యాధి ముదిరిపోయినా కేవలం రెండు గంటల వ్యవధిలో ఈ పరీక్షల ద్వారా నిర్ధారణ సాధ్యమవుతుంది. వ్యాధిగ్రస్తుడి బరువును బట్టి మందులు అందించడంతో, ఆయా మందుల ద్వారా కలిగే పలు రకాల ఇబ్బందులు చాలావరకూ తగ్గాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులకు సంబంధించిన క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులందరికీ గళ్ళ పరీక్షలు చేసి, వారికి కూడా బరువు ప్రకారం 6 నెలల మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీని వలన ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే శాతం తగ్గిపోతుంది.

క్రమ బద్ధంగా మందులు వాడితే నివారణ

క్షయ వ్యాధిగ్రస్తుడు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేసే 168 డోసుల మందులను వాడాల్సిఉంది. అలా వాడితే వంద శాతం క్షయవ్యాధి నయం అవుతుందది. ఒక వేళ సక్రమంగా వాడకపోతే వ్యాధి తిరగబడి మొండి (ఎం.డి.ఆర్) టీ.బీ.గా మారుతుంది. ఇందులో కొన్ని ప్రాణాంతకం కూడా అయ్యే అవకాశం ఉంది. ఆ మందుల ఖరీదు కూడా రమారమి 10 నుంచి 15 లక్షల విలువ వుంటుంది. కాగా ఆ మందుల వాడకం వలన కొంతమేర దుష్ఫలితాలు కూడా వుండే అవకాశాలున్నాయి. అయినప్పటికీ వైద్యుల సలహామేరకు ఇంటి దగ్గరకు వచ్చే నర్సులు- ఆశా వర్కర్లకు పేషెంట్స్ సహకారం తప్పనిసరి. సకాలంలో మొదట సూచించిన ప్రకారంగా మందులు వాడితే పరిస్థితి తీవ్రస్థాయికి చేరదు.

నిర్ధారణ పరీక్షలతోనే రక్షణ

క్షయ వ్యాధి ప్రధానంగా దురలవాట్లకు, హెచ్ఐవి (ఎయిడ్స్) డయాబెటిస్ (షుగర్) రక్తహీనత కలిగిన గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధుల, కార్మికులు, నిరక్షరాస్యులు, మురికి వాడల్లో వుండే వారు., వ్యాధి నిరోధక శక్తి లేని వారికి వచ్చే అవకాశాలున్నాయి. వీరితో పాటుగా పొగతాగేవారికి, మద్యం సేవించేవారికి, బీడీ కార్మికులకు, సున్నం, సిమెంట్, దుమ్ము, ధూళి వచ్చే ఫ్యాక్టరీలలో పనిచేసేవారికి పరస్త్రీ-పురుష లైంగిక సంపర్కం గల ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు వ్యాధి ఎక్కువగా సోకే వీలుంది. వీరంతా రెండు వారాలకు మించి ఎడతెరపి లేని దగ్గున్నా, సాయంకాలం పూట జ్వరం, ఛాతీలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఉమ్మి లేదా గళ్ళలో రక్తం పడడం తదితర లక్షణాలు కలిగిన వ్యక్తులు సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోనట్లయితే వారి పరిస్థితి అధోగతే.

వంద శాతం మరణాలు లక్ష్యం



జిల్లాలో క్షయ వ్యాధి అంతమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. వ్యాధి బాధితులకు వెంటనే వైద్యం అందించడం, రాబోవు కాలంలో అడల్ట్ బీసీజీ అందించడం ద్వారా 2025 నాటికి వ్యాధిని పూర్తిగా నియంత్రించే వీలుంది. భారతదేశంలో 2018 నుంచి ప్రతీ సంవత్సరం సుమారు 27.09 లక్షల మంది కొత్తగా వ్యాధిబారిన పడుతుండగా, ప్రతి సంవత్సరం 4. 23 లక్షలు ప్రతి 3 నిమిషాలకు ఇద్దరు చొప్పున మృత్యుబారిన పడుతున్నట్లు గణాంకాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 78 వేల మంది క్షయవ్యాధి బాధితులను గుర్తించారు. మరణించే వారి సంఖ్య 4,500 దాకా ఉన్నట్లు సమాచారం. ఆ లెక్కన ప్రతి రెండు నిమిషాలకు ఒక్కరుగా గుర్తించారు. జిల్లా వారీగా ప్రతి సంవత్సరం రమారమి 6 వేల మంది వ్యాధిబారిన పడుతున్నారు. ఆ పరంపరలో 2022 నాటికి 4,682 మంది, 2023 నాటికి 4,348 మంది, 2024 మార్చి నాటికి 947 మంది ఉన్నట్లు గుర్తించారు. మరణాల శాతం 0. 5 గా వుంది. మరణాల శాతాన్ని 0 కి చేర్చడమే అంతిమ లక్ష్యం.

- సుబ్బరాయుడు, ఎస్‌టీఎస్ సూపర్‌వైజర్.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి. భార్యకు గాయాలు





మృతిచెందిన హరికృష్ణ (ఇన్‌సర్ట్) గాయపడిన శ్రీలేఖ

రాజంపేట టౌన్, మార్చి 27: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని భార్య కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కొల్లావారిపల్లె పంచాయతీ గోపమాంబపురం వడ్డిపల్లెకు చెందిన బుర్సు హరికృష్ణ (24), చిట్వేలి మండలం వడ్డిపల్లెకు చెందిన శ్రీలేఖతో 5 నెలల క్రితం వివాహం జరిగింది. శ్రీలేఖ తండ్రి కువైత్‌కు వెళుతున్న సందర్భంగా వారు మంగళవారం ఉదయం వడ్డిపల్లెకు బైక్‌పై వెళ్లి వస్తూ, ఊటుకూరు సమీపంలోని అశోక్ గార్డెన్స్ వద్ద కడప నుండి తిరుపతికి వెళుతున్న లారీని వేగంగా ఢీకొన్నారు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో హరికృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శ్రీలేఖ రోడ్డు పక్కన గాయాలతో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 వాహనంలో రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజంపేట మన్నూరు పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన శ్రీలేఖ మూడు నెలల గర్భిణి

తాగునీటి కోసం వెళ్లి.. గుండెపోటుతో మహిళ మృతి



తల్లి మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

మైదుకూరు రూరల్ మార్చి 27 : తాగునీరు తెచ్చుకోవడానికి ట్యాంకరు వద్దకు వెళ్లిన ఓ మహిళ, ఇంటికి రాగానే కింద పడిపోయి ప్రాణాలు వదిలింది. మైదుకూరు పట్టణంలో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా... పట్టణంలోని 12వ వార్డుకు చెందిన షేక్ బాను (37) రెండేళ్లుగా ముగ్గురు పిల్లలతో కలసి భర్తకు దూరంగా ఉంటోంది. కూలి పనులు చేసు కుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం ట్యాంకర్ వద్దకు వెళ్లి బిందెతో నీరు పట్టుకుని ఇంటికి వచ్చింది. ఉన్న ట్లుండి కిందపడి ప్రాణాలు కోల్పోయింది. కాగా, ఆమె గుండెపోటుతో మరణించి ఉండవచ్చని బంధువులు తెలిపారు. దీంతో ఆమె ముగ్గురు పిల్లలు ఇర్ఫాన్, మస్తాన్, చాను అనాథలుగా మారారు. కాగా, తాగునీటి సరఫరా విషయంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యమే ఆమె మరణానికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలే రెండు ఇళ్లల్లో చోరీ



చోరీకి గురైన బీరువా

రాజంపేట టౌన్, మార్చి 27: పట్టణంలోని బలిజపల్లెలో బుధవారం పట్టపగలే రెండు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. స్థానిక బలిజపల్లెలో నివసించే చంద్రకళ ఇంటికి తాళం వేసి బెంగుళూరులోని కూతురి వద్దకు వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన యశోదమ్మ ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లింది. ఈ రెండు ఇళ్లకు తాళాలు వేసిన విషయం గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి, ఇళ్ల లోకి ప్రవేశించారు. బీరువాలు, ర్యాక్‌లలోని బట్టలు చెల్లాచెదురు నగలు,నగదు అపహరించుకు వెళ్లా రు.. కాగా, చోరీ విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న యశోదమ్మ తన ఇంటిలో 60 గ్రాముల బంగారు, కొద్దిపాటి నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫోన్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. చంద్రకళ అందుబాటులో లేకపోవడంతో చోరీ సొమ్ము వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి



సాహిల్ మృతదేహం

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 27: మండలంలోని శెట్టిగుంట పంచాయతీ మారివారిపల్లె ప్రధాన రహదారి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి సయ్యద్ సాహిల్(16) వేలూరు సీఎంసీ ఆసుపత్రితో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోడూరు సీఐ టి.బాబు తెలిపారు. మృతదేహానికి కోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి అబ్దుల్ సలామ్ ఉపాధి కోసం గల్ఫ్ దేశాల్లో ఉన్నాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే భారతదేశానికి తిరిగి వచ్చాడు. సాహిల్ మృతితో పెద్దపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, మార్చి 27: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈనెల 26న కడపలోని కడప స్పోర్ట్స్ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ జిల్లా స్థాయి ట్రయల్స్‌లో అండర్-17, అండర్-19 విభాగంలో ముగ్గురు విద్యార్థినిలు, నలుగురు విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 30, 31 తేదీలలో విజయవాడలోని కృష్ణలంకలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనను న్నట్లు డైరెక్టర్ తెలిపారు.

నేత్రపర్వంగా మాధవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దముడియం, మార్చి 27: మండల పరిధిలోని పెద్దపసుపులలో బుధవారం మాధవస్వామి రథోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, చెక్కభజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేతుడై మాధవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.. ఆలయ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి , దేవదాయశాఖ అధికారులు, పోలీసులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ఆహ్వానం మేరకు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి పూజలు చేశారు.

బి కొత్తకోట సరిహద్దులో రూ.3లక్షలు నగదు సీజ్

బి కొత్తకోట, మార్చి27: మండల పరిధిలోని దానామిట్ట చెక్‌పోస్టు వద్ద రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి బి కొత్తకోట వైపు వస్తున్న ఓ కారులో సుదర్శన్‌రెడ్డి అను వ్యక్తి రూ.3 లక్షలు నగదు తీసుకొస్తున్నాడని, ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకొని రాయచోటిలోని ట్రెజరీలో జమచేశామన్నారు. బి కొత్తకోట బీసీ కాలనీలో షేక్ అలీసాబ్(55) ను అరెస్టు చేసి అతని నుంచి 1.08 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలో వివిధ పాతకేసులలో ముద్దాయిలైన 10 మందిని డిప్యూటీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు తెలిపారు. బి కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లికి చెందిన వివాహిత భువనేశ్వరి(19) అదృశ్యం అయిందని, ఈమెను అదే గ్రామానికి చెందిన వెంకి అనే వ్యక్తి తీసుకెళ్లి ఉంటాడని అనుమానం ఉన్నట్లు ఆమె తల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

కురబలకోట, మార్చి 27: టెంపో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అన్నదమ్ములకు తీవ్రగాయాయ్యాయి. రాపూరివాండ్లపల్లె పంచాయతీ ఉప్పరోళ్ళపల్లెకు చెందిన ఇమ్మానుయేల్(37), రాజు(34) సీటీఎం నుంచి స్వగ్రామానికి వెళ్ళుతుండగా కంటేవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న టెంపో ఢీకొంది 108సాయంతోవారిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక చైతన్యానికి మూలం నాటకం

- జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి



కళాకారులను సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : వాస్తవ దృక్పథానికి, సాంఘిక చైతన్యానికి మూలం నాటకం అని, సమాజంలో ప్రతి సమస్యకు ప్రతిస్పందించి, ప్రతి సంఘటనను ప్రతిబింబించేది నాటకమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో రంగస్థల కళాకారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో నాటకం ఒక భాగమని, ఏ ప్రక్రియకు లేని గొప్పతనం నాటానికి ఉందని, అందరినీ ఆకట్టుకునే లలిత కళల సమైక్య స్వరూపం నాటకమన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వ వెంకటయ్య మాట్లాడుతూ నాటకం పురోగమించాలంటే ప్రతి యూనివర్సిటీలో రంగస్థల కళల విభాగం ఉండాలన్నారు. ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగిన నాటకం ఇప్పుడు వెలవెలబోతోందన్నారు. అనంతరం ప్రముఖ నటుడు, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా జిల్లా రచయితల సంఘం జిల్లాలో ప్రసిద్ధులైన రంగస్థల కళాకారులు సుబ్బరామయ్య, రామనపల్లె శంకర్, ఎన్.సుబ్బరాయుడు, కె.ఓబులేసు, బాలఓబులయ్య, ఎం.చెన్నయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మురళి, గంగయ్య, నారాయణ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల కేటాయింపుల్లో అవకతవకలు సరిచేయాలి

- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 27 : పదోతరగతి మూల్యాంకన విధుల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలను సరిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ బాబునాయక్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి మూల్యాంకన విధులు కేటాయింపులను ఇష్టారాజ్యంగా తప్పులతడకగా రూపొందించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ ఉపాధ్యాయులను పక్కన బెట్టి పాఠశాల సహాయకుడిగా పదోన్నతి పొంది కనీసం ఏడాది కూడా పూర్తి కాని ఉపాధ్యాయులను విధులకు కేటాయించారన్నారు. ఏడాది క్రితం సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు సైతం మూల్యాంకన విధులు కేటాయించారంటే, విధుల కేటాయింపు ఎంత పారదర్శకంగా అమలు జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొంది ఆ వెంటనే రీ పాట్రియేషన్ ద్వారా ఎస్‌జీటీగా వెళ్లిన ఉపాధ్యాయురాలికి సైతం విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు పంపారని ఆరోపించారు. కడప చింతకొమ్మదిన్నె మండలాల పరిధిలోని శాంతినగర్, నాగిరెడ్డిపల్లె మూలవంక ఉన్నత పాఠశాలలు గత ఏడాదే అప్‌గ్రేడ్ అయ్యాయన్నారు. కానీ ఆ పాఠశాలల ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించారన్నారు. అలాగే మరికొన్ని ఉదాహరణలు చూపించారు. తెలుగు మూల్యాంకనానికి సంబంధించి భాషోపాధ్యాయులుగా దీర్ఘకాలంగా పదో తరగతి బోధించిన అనుభవాన్ని పక్కనబెట్టి జూనియర్లకు మూల్యాంకన విధులు కేటాయించారని ఆరోపించారు. మూల్యాంకనం ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మూల్యాంకన విధుల కేటాయింపుల్లో జరిగిన తప్పులను అవకతవకలను సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎస్ఏజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇదీ..జగన్ సొంత ఇలాకాలో ఇళ్ల తీరు...!

- మంజూరు చేసిన ఇళ్లు 7079
- పూర్తయినవి 310.. చేరినవి 0
- కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి



వేంపల్లెలో రోడ్లను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 27: పులివెందుల నియోజకవర్గం ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం. పులివెందుల పట్టణం జగన్ సొంత పట్టణం. పులివెందుల పట్టణంలో జగనన్న ఇళ్ల కాలనీ పేరుతో 7079 ఇళ్లు జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికి 310 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అందులో ఒక్కరు చేరలేదు. జగన్ అసమర్థ పాలనకు ఇంతకంటే నిదర్శనం కావాలా అని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడి యా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలోనే ఇంత అధ్వాన్నంగా ఉంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో ఆలోచించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు. వేంపల్లె పట్టణంలో ప్రతిరోజు దుమ్ము తుఫాన్లు వస్తుంటాయన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో సంవత్సరం కిందట వేంపల్లెను శిథిల వేంపల్లెగా ప్రభుత్వం మార్చిందన్నారు. వైసీపీ సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా బస్సుయాత్ర సాగే మార్గంలో రోడ్లపై దుమ్ము లేయకుండా ట్యాంకర్లతో నీళ్లు చల్లారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఎక్కడ చూసిన మురికినీటి కుంటలే దర్శనమిస్తున్నాయన్నారు. వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణ పేరుతో ఉన్న రోడ్డును తవ్వారు. కొత్త రోడ్డు వేయలేదు, రెండు సంవత్సరాల నుంచి ప్రయాణికులు నరకం చూస్తున్నారని తెలిపారు. అలాగే పులివెందుల నియోజకవర్గం అసాంఘిక శక్తుల అడ్డాగా తయారైందన్నారు. మద్యం ఏరులై పారుతోందన్నారు. జూదం విచ్చలవిడి అయిందని, మట్కా, బెట్టింగుల నిలయమైందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.

నీరుగారిన వైసీపీ కార్యకర్తల ఉత్సాహం

- బస్సుపై నుంచే అభివాదం చేస్తూ వెళ్లిపోయిన జగన్



బస్సుపైనుంచి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

ఎర్రగుంట్ల, మార్చి 27: జగన్‌మోహన్‌రెడ్డి రాకకోసం గంటలకొద్దీ వేచి చూసిన కార్యకర్తల ఉత్సాహం.. ఆయన బస్సుపై నుంచే అభివాదం చేస్తూ వెళ్లిపోవడంతో నీరుగారిపోయింది. బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం వేంపల్లి నుంచి ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఎర్రగుంట్ల శివారు నుంచి జగన్‌ను చూసేందుకు స్వాగతించేందుకు అభిమానులు కార్యకర్తలు తరలివెళ్లారు. అయితే, జగన్ రాక ఆలస్యం కావడంతో కార్యకర్తలు కొద్దిగా అసహనానికి గురైనా, నాలుగు రోడ్ల వద్ద జగన్ వచ్చేంత వరకు వేచి చూశారు. జగన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అభిమానులు కార్యకర్తలు ఆశించారు. అయితే ఆద్యంతం ఆయన బస్సు పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లడంతో కార్యకర్తలు నిరుత్సాహపడ్డారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద ముందుగా జనం లేకపోయినా జగన్ వచ్చే సరికి ఒక్కసారిగా అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. జగన్ వాహనం నెమ్మదిగా కదులుతూ పోట్లదుర్తి మీదుగా ప్రొద్దుటూరు సభకు వెళ్లింది. జగన్ వెంట పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మూలే సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆశీర్వదిస్తే..అభివృద్ధి చూపిస్తా

● టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి 27: ఒక్కసారి రాయచోటి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రాయచోటిని అభివృద్ధి బాటలో నడిపిస్తానని రాయచోటి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాదురెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని చాకిబండ గ్రామ పంచాతీలోని అన్ని గ్రామాల్లో తన కుమారుడు నిచ్చల్‌నాగిరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పరిపాలనలో అన్యాయాలు, అక్రమాలు, భూదందాలు, ఇసుక అక్రమాలు, దాచుకోవడం.. దోచుకోవడం తప్ప అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జగరలేదని, వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కొల్లగొట్టుకున్నారే తప్ప అభివృద్ధి కనిపించలేదన్నారు. అనంతరం చాకిబండి కురవపల్లెలో కొంతమంది వైసీపీ నుంచి టీడీపీలోకి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం



తాగునీటి సమస్యపై పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

సిద్దవటం, మార్చి 27: మండలంలోని మాధవరం గ్రామపంచాయతీ భద్రాద్రి బావ నారాయణ స్వామి వీధిలో మంచినీటి సమస్య ఏర్పడటంతో వాటిపై స్పందించిన మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు బుధవారం గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ నరసయ్యను పిలిపించి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని పంచాయతీ అధికారులకు ఆదేశించామని తెలియజేశారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ప్రజలు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 27: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులపై అధికారులు దృష్టి పెట్టాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి శివరాముడు తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే ఎన్నికల అధికారులు దృష్టికి తీసుకునిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల గ్రామోత్సవం

చిన్నమండెం, మార్చి 27: మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీలోని కురవపల్లెలో గల నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం ఉదయం కలశస్థాపన, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, మొదలగు పూజలతో ప్రారంభమై సాయంత్రం ఉత్సవ విగ్రహాలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా పురవీధుల్లో చెక్కభజనలు, కోలాటాలు, డీజే సినిమా పాటలకు డ్యాన్స్‌లు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం దేవరింటి నాగరాజ ఏర్పాటు చేశారు. నేడు సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

రాజంపేట,మార్చి 27: మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-బ్లేజ్ 23-24 శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వారు ఈఈఈ విభాగంలో తిరుపతిలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆటోమెటిక్ ఇరిగేషన్ సిస్టం విత్ వైర్‌లెస్ కంట్రోల్ అండ్ ఎన్విరాన్‌మెంటు మానిటరింగ్ బై యూసింగ్ సోలార్ పవర్ అనే అంశంపై ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రదర్శించినందుకు విద్యార్థులు బి.తేజరాజు, ఉమామహేశ్వరి, తేజశ్రీవాణి, ఉదయ్‌లకు సర్టిఫికెట్లు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చొప్పా గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

అన్నమాచార్యలో ముగిసిన వర్క్‌షాప్

రాజంపేట మండలం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో లాంగ్వేజీ పైథాన్ కోడింగ్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగాలు ఎలా పొందాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్ మహేంద్ర ఫ్రైడ్‌క్లాస్ రూమ్, నాంది ఫౌండేషన్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన శరత్ మాట్లాడారు.

విజయంలో కీలక పాత్ర పోషించాలి

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 27: జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ అభ్యర్థి విజయానికి కీలక పాత్ర పోషించాలని మాజీ సీఎం చంద్రబాబు రైల్వేకోడూరు సీనియర్ నాయకుడు విశ్వనాథనాయుడును ఆదేశించారు. బుధవారం చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమంలో చంద్రబాబును ఆయన కలిసి రాజకీయ స్థితిగతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, వాణిజ్య విభాగం కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల నాడాలోళ్లకు భలే గిరాకీ

● ఒక్క ఎద్దు కాళ్ల గిట్టలకు నాడాలు వేస్తే రూ. 600

● రాయచోటి నుంచి వచ్చి నాడాలు వేస్తున్న వైనం

సాంకేతిక విప్లవం దెబ్బకు సంప్రదాయం తోక ముడుచు కుంటోంది. ప్రధానంగా అన్ని రంగాలకు మూలాధారమైన వ్యవసాయం పూర్వం వివిధ కుల, చేతివృత్తుల వారికి జీవనోపాధి కల్పించేది. క్రమక్రమంగా యంత్రాలు రంగ ప్రవేశం చేయడం, వాటి ద్వారా ఖర్చు, సమయం ఆదా కావడంతో రైతులు యంత్రాలపై మొగ్గు చూపసాగారు. ఫలితంగా ఎద్దులతో నాగలి దున్నకం, ఎద్ల బండ్లు కను మరుగయ్యాయి. ఎద్దుల అవసరం చాలా వరకు తగ్గిపో యింది. ప్రస్తుతం ఎద్దులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మనిషికి చెప్పులు ఎంత అవసరమో సేద్యం చేసే ఎద్దు లకు నాడాలు కూడా అంతే అవసరమని ఎద్దుల యజ మానులు అంటుంటారు. ఆ నాడాలు వేసేవారు ఇప్పుడు కరువయ్యారు. ఎక్కడో ఒక చోట ఉండటంతో వారికి గిరాకీ బాగా పెరిగింది. పూర్వం ఒక్క ఎద్దుకు నాడాలు వేస్తే రెండు అణాలు, తర్వాత రూపాయి, రూ.5, రూ.20, రూ.50, రూ.100 ఇలా పెరుగుతూ పోయింది. ప్రస్తుతం రూ.600 ఇవ్వాల్సి వస్తోందని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వివరాలు ఇవీ...



ఎద్దుకు నాడాలు వేసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 27: బండ్లను ఈడ్చే ఎద్దులు, వ్యవసాయ పనులు చేసే పశువులకు నాడాలు వేసే వారు కరువయ్యారు. నాడాలు కూడా కనుమరుగు అవుతు న్నాయి. గతంలో ఊరికి ఇద్దరు నాడాలు వేసే వారు ఉండేవారు. ప్రస్తుతం జిల్లాకు ఒకరిద్దరు ఉన్నారు. పశువులు కాలక్రమేణా అంతరించిపోతున్న తరుణంలో నాడాలు కూడా కనుమరుగు అవుతున్నాయి. పశువుల కాళ్ల గిట్టలకు నాడాలు వేస్తారు. దీంతో ఎద్దులకు పటుత్వం కల్గి ఉంటాయి. నాడాలు సుమారు రెండు నెలల పాటు ఉంటాయి. తర్వాత మళ్లీ మార్చు కోవాల్సి వస్తుంది. వ్యవసాయం చేసే పశువులకు అయితే రోజు 20కి పైగా నాడాలు వేస్తారు. పట్టణాల్లో ఉన్న బండ్లు లాగే ఎద్దులకు అయితే రోజుకు 10కి పైగా నాడాలు వేస్తారు. పూర్వం ఒక్క ఎద్దుకు నాడాలు వేస్తే రెండు అణాలు, తర్వాత రూపాయి, రూ.5, రూ.20, రూ.50, రూ.100 ఇలా పెరుగుతూ పోయింది. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఎద్దుల నాడాలు వేసే వారి ఒక్క ఎద్దు కు రూ. 600 ఇవ్వాల్సి వస్తుంది. పట్టణాల్లో బండ్లు లాగే ఎద్దులు మాత్రమే 5 నుంచి 10 మంది మాత్రమే చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దులు అరకొరగా ఉన్నాయి. వీటికి యజమానులు నాడాలు వేయిస్తారు. బురదలో ఎక్కువగా ఎద్దులు పని చేస్తే నాడాలు ఒక్క నెలకే ఊడిపోతాయని రైతులు అంటున్నారు. బండ్లు లాగే ఎద్దులకు ఖచ్చితంగా నాడాలు ఉండాలి. రోడ్లపై పటుత్వం ఉండాలి కాబట్టి నాడాలు రెండు నెలలకు ఒక్కసారి వేయించాల్సి ఉంటుంది. గతంలో ఎద్దుల గిట్టలకు వేసే నాడాలు కొలిమిలో తయారు చేసే వారు. నాడాలకు చీలలు కూడా ప్రత్యేకంగా తయారు చేసే వారు. ప్రస్తుతం కొలిమిలు కూడా అంతరిస్తున్న సమయంలో నాడాలు తయారు చేసే వారు అతి తక్కువ మంది ఉన్నారు. చీలలు కూడా తమిళనాడు నుంచి తీసుకుని వచ్చే పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయం ఎద్దులతో చేసే వారు చాలా తక్కువ మంది ఉంటారు. అయితే ట్రాక్టర్లు అనేక యంత్రాలు రావడంతో ఎద్దులతో పని లేకుండా పోయింది. ఎక్కువగా ఆవులు, గేదెలను రైతులు పెంచుకుంటున్నారు. రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో ఎద్దులతోనే జీవనం సాగించే వారు దూర ప్రాంతాలకు చెందిన వారితో నాడాలు వేయించు కుంటున్నారు. నాడాలు వేయడం ప్రత్యేకమైన కళ. ఎవరు పడితే వారు వేయలేరు. ఎద్దును పెద్ద తాడుతో నడుము వద్ద పట్టుకుని కిందపడేసి నాలుగు కాళ్లను కట్టేసి ఎద్దు కదలనివ్వకుండా చేసి కాళ్లగిట్టలను ముందుగా పరిశీలి స్తారు. సక్రమంగా ఉంటే నాడాలు బిగిస్తారు. లేకపోతే గిట్టలను చిన్న పాటి ఇనుప ఒలితో చెక్కి తర్వాత నాడాలు వేస్తారు. చీలలు కూడా దింపేప్పుడు ఎద్దుకు నొప్పి తెలియకుండా వేస్తారు. రక్తం రాకుండా చూస్తారు. మనిషికి చెప్పులు ఎలా అవసరమో అలాగే ఎద్దులకు కూడా చెప్పులు లాగే నాడాలు అంతే అవసరమని ఎద్దుల యజమానులు అంటున్నారు.

పశువులకు నాడాలు వేయాలంటే నైపుణ్యం ఉండాలి

పశువులకు నాడాలు వేయా లంటే నైపుణ్యం ఉండాలి. రోజుకు వ్యవసాయ పనులు చేసే ఎద్దులకు అయితే 20కి పైగా నాడాలు వేస్తాము. పట్టణాల్లో బండ్లు లాగే ఎద్దులకు రోజుకు 10 ఎద్దులకు నాడాలు వేస్తాము. నాడాలు వేయడం బాగా తెలిసి ఉండాలి. గిట్టల సైజును బట్టి నాడాలు చేయాలి. ఎక్కడ పొరపాటు రాకుండా చూసుకోవాలి. ఒక్క ఎద్దుకు నాడాలు వేస్తే రూ.600 తీసుకుంటాం. ఫోన్లు చేసిన ఎద్దుల యజమానుల దగ్గరకు వెళ్లి నాడాలు వేస్తుంటాము. పనితనం బాగా ఉంటుంది.

- సయ్యద్ ఆరిఫుల్లా, నాడాలు వేసే వ్యక్తి, రాయచోటి

రెండు నెలలకు ఒకసారి నాడాలు వేసే వ్యక్తిని పిలిపిస్తాం

రెండు నెలలకు ఒక సారి నాడాలు వేసే వ్యక్తిని పిలిపించి నాడాలను ఎద్దులకు వేయిస్తాం. ఎద్దులకు నాడాలు వేస్తే బాగా పరుగులు తీస్తాయి. ప్రస్తుతం రైల్వేకోడూరులో పదికి మించి ఎద్దుల బండ్లు లేవు. చాలా వరకు కనుమరుగయ్యాయి. ఉన్న వాటితో జీవనం సాగిస్తున్నాం.

- శొడిశెట్టి భద్ర, ఎద్దుల బండి యజమాని



ఎద్దు కాళ్ల గిట్టలను ఉలితో సరి చేస్తున్న నాడాలు వేసే వ్యక్తి

బోనాలతో ప్రారంభమైన పాలేటమ్మ జాతర



అమ్మవారి మూలవిరాట్

చిన్నమండెం, మార్చి 27: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలో దేవలంపేటనందు వెలసిన పాలేటమ్మతల్లి జాతర మహోత్సవం బుధవారం సద్దల బోనాలతో ప్రారంభమైంది. ఉదయం నుంచి ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అమ్మవారికి మొక్కుబడులు, బోనాలు సమర్పించారు. బుధవారం రాత్రి నిండు తిరుణాల, గురువారం మైలు తిరుణాలతో జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరకు 17 చాందినీ బండ్లు పర్మిషన్ తీసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, 20 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. జాతరకు వచ్చు భక్తుల వాహనాలకు ట్రాఫిక్ నిబంధనలు అంతరాయం కలగకుండా ప్రత్యేక స్టాండ్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : ఆర్డీఓ

సుండుపల్లె, మార్చి 27: మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు తెలిపారు. బుధవారం సుండుపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. 14 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్యలపై ఆరాతీశారు. ఏ గ్రామ పంచాయతీలో ఎక్కడక్కడ తాగునీరు సమస్య ఉందో తెలుసుకొని గురువారం ఉదయం నుంచి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని ఆదేశించారు. మాచిరెడ్డిగారిపల్లె, ఉడంపాడు, సొంటంవారిపల్లె, బాగంపల్లె, తిమ్మసముద్రం, చిన్నగొల్లపల్లె, జి.రెడ్డివారిపల్లెతో పాటు పలు గ్రామాల్లో తాగునీటి సమస్యను గురించామన్నారు. సమస్య ఉన్న ప్రాంతాలలో రోజుకు 36 ట్యాంకర్ల తాగునీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జెరీనా బేగం, ఎంపీడీఓ అమరనాథ, ఎంఈఓ రవినాయక్, సర్వేయర్ రక్షిత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై అధికారులు, సిబ్బందితో ఆరాతీస్తున్న ఆర్డీఓ

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలి

ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొనేలా ఏర్పాటు చేయాలని బుధవారం రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. రాజంపేటలో బాధ్యతలు చేపట్టి మొదటిసారి సుండుపల్లెకు రావడంతో తహసీల్దార్ జెరీనాబేగం, రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నిర్వాహణపై పలు సూచనలు, సలహాలను ఆయన తెలియజేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వృద్ధులు, వికలాంగుల బూతుల్లోకి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు కొత్తగా ఓటర్‌కార్డు పొందిన యువకులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఇదేనా...!

సంబేపల్లి, మార్చి 27: రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పడం తప్ప అభివృద్ధి ఎక్కడ అని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లెకు వెళ్లే రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోడ్లపైన కంకర తేలి ప్రజలు అవస్థలు పడుతుంటే ఇవి ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా కనీసం సిమెంట్ రోడ్లు వేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలం మెత్తం సిమెంట్ రోడ్లు వేసే భాద్యత తీసుకుంటామని ప్రజలకు హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయన వెంట టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కమనీయం వేంకటేశ్వరుని కల్యాణం

మండలంలోని దుద్యాల గ్రామం వడ్డేపల్లెలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం మహోత్సవాన్ని కన్నుల పండువగా జరుపుకున్నారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిరాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరితో పాటు పారిశ్రామికవేత్త శ్రీనివాసులరెడ్డి, రాహుల్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు.

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది : తహసీల్దార్

సంబేపల్లి, మార్చి 27: ఓటు వజ్రాయుధమని, ప్రజాస్వామ్యనికి పునాది అని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సంబేపల్లిలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డబ్బుకు, మద్యానికి ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా సమాజానికి మేలు చేసే వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

నందలూరు, మార్చి 27: మండలంలోని పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ముగిశాయి. నాగిరెడ్డిపల్లె, నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఆడపూరులోని అంబేద్కర్ సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు కొనసాగాయి. చివరి రోజు సోషియల్ పరీక్షను విద్యార్థులు రాశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు.

ప్రజలకు మంచి చేయాలనే వచ్చాను

● రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

చిట్వేలి, మార్చి 27: ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని రైల్వేకోడూరు జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిట్వేలిలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను వైసీపీ నాయకులు కోవర్టు అనే మెస్సేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళుతున్నారని, తాను ఏ పార్టీకి కోవర్టు కాదన్నారు. తనపై బురదజల్లే ప్రయత్నాన్ని మానుకోవాలని ఆయన హెచ్చరించారు. రైల్వేకోడూరుకు మంచి చేయాలని ఉద్దేశ్యంతో తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ తనకు అవకాశం ఇచ్చారని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి జరగకుండా వైసీపీ నాయకులు కంకణం కట్టుకున్నారన్నారు. కోడూరు నియోజకవర్గంలో రోడ్డు సమస్యలు మొదలుకొని మంగంపేట నిధులను దోచుకుంటున్నారన్నారు. అందరినీ కలుపుకొని నియోజకవర్గ అభివృద్ధి ఎలా చేయాలో చేసి చూపిస్తానన్నారు. అందుకు ప్రజలు సహకరించి తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాదినేని నరేష్‌బాబు, గంధంశెట్టి దినకర్, ఎన్.దాశరథి, మర్రిరెడ్డి ప్రసాద్, గంధంశెట్టి కిషోర్, పగడాల రఘు, రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యనాయుడు, శివ, చక్రి, సుబ్బు, వెంకటేష్, జనసైనికులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఆలయ ధర్మకర్తలు



డీఎస్పీని సత్కరిస్తున్న దృశ్యం

రాజంపేట, మార్చి 27: రాజంపేట డీఎస్పీ చైతన్యను జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగిరిపాడు ఆలయ ధర్మకర్తలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 28 నుంచి వచ్చే నెల 7వ తేది వరకు పదకొండు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు శాంతిభద్రతల దృష్ట్యా సహకరించాలని తెలిపారు. ఉత్సవాలకు డీఎస్పీని ఆహ్వానించారు. బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రతులను చూసి రంగనాయకస్వామి ఆలయ ప్రతిష్టను తెలుసుకోవాలని కోరారు. పదకొండు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ శాంతి ప్రవచనాలు, భక్తి ఆలాపనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, నరసరామయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత


వీరబల్లి, మార్చి 27: మండలంలోని సానిపాయి గ్రామంలో రాజంపేట చిరంజీవి యువత అధ్యక్షుడు గుగ్గిళ్ల నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ దాదాపు 25 మంది యువత రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి సీనియర్ అభిమాని పోలిశెట్టి శ్రీనివాసులు, శ్రీరాములు, రాయచోటి చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు జయరాం, రెడ్డిచర్ల నాగరాజు, అర్జున్ కుమార్, రవీంద్ర, మనోజ్, హిమాంత్, గుగ్గిళ్ల వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.

బేరాలగుట్ట వేలం రూ.1.65 లక్షలు

గాలివీడు, మార్చి 27: మండలంలో గోరాన్‌చెరువు పంచాయతీ బేరాలగుట్ట కట్టుడురాయి, గేటు వేలంపాటలో రూ.1.65 లక్షలు పలికినట్లు ఈఓపీఆర్డీ శేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈ వేలంపాట నిర్వహించారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది రూ.50 వేలు ఎక్కువ పలికిందని వారు తెలిపారు. ఈ వేలం ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు దీప్తి, పంచాయతీ కార్యదర్శి సరోజమ్మలు పాల్గొన్నారు.



ఆర్గానిక్ ఆంధ్రా - ఆరోగ్య ఆంధ్రా లక్ష్య సాధనలో



కొండా నరేంద్ర





పెట్టుబడి పెరిగిపోయి... దిగుబడి తగ్గిపోయి.. గిట్టుబాటు ధర లేక... అప్పులు చేసి, పంటలు పండించలేక ... ఎంతో మంది రైతులు అవస్థలు పడుతున్నారు. మధ్య దళారీల ఆగడాలు అన్నదాతలను అధఃపాతాళానికి తొక్కేస్తున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారం తగ్గిపోతోంది. రైతన్న నమ్ముకున్న నేల విషతుల్యమవుతోంది. అందుకే భూమిని, ఆ భూమిని నమ్ముకున్న రైతును కాపాడటం కోసం ఓ ఆపన్నహస్తం ముందుకు వచ్చింది. ఆ ఆపన్నహస్తం పేరే

"కొండా నరేంద్ర"

తంబళ్ళపల్లి, మదనపల్లిని ఆర్గానిక్ హబ్‌గా మార్చి, ఆంధ్రప్రదేశ్‌ను ఆర్గానిక్ రాష్ట్రంగా తయారు చేసేందుకు శ్రీ కొండా నరేంద్రగారు కంకణం కట్టుకున్నారు. ఆ లక్ష్యసాధన వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, దిగుబడిని పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. RUKVINA ఫార్మ్స్ పేరుతో "పొలం బడి" ని నిర్వహిస్తున్నారు. రైతులకు వ్యవసాయంలో మెలుకవలు నేర్పిస్తూ ... నిపుణుల సలహాలు, సూచనలు రైతులకు అందేలా చేస్తున్నారు. ప్రపంచానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న "శ్రీ నరేంద్ర మోడీ" గారి ద్వారా ప్రేరణ పొంది, విజనరీ లీడర్ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆలోచనలతో స్ఫూర్తి పొంది, జనసేనాని శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రసంగాలతో ఆకర్షణ చెంది సమాజానికి ఏదో చేయలన్న సంకల్పంతో రైతు బాంధవులుగా మారారు. శ్రీ కొండా నరేంద్ర గారు నా ప్రాంతం, నా రైతు, నా యువత అంటూ వారి అభ్యున్నతికి పాటు పడటమే లక్ష్యంగా పెట్టుకొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, అభివృద్ధి అనే పంచ సూత్రాలను తూచ తప్పకుండా ఆచరిస్తున్నారు.






రైతు సదస్సులో ఆర్గానిక్ సాగుపై

రైతులకు సూచనలు, సలహాలిస్తున్న

కొండా నరేంద్ర







కొండా నరేంద్ర
పారిశ్రామికవేత్త, వ్యవసాయ నిపుణులు
తంబళ్ళపల్లి నియోజకవర్గం

N.D.A. కూటమి గెలుపు - A.P. లో అభివృద్ధికి మలుపు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



రోడ్డు ప్రమాదాలపై సమీక్షిస్తున్న సీఐ, అధికారులు

కలకడ, మార్చి 27:రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కలకడ, కేవీపల్లె మండలాల పరిధిలోని రహదారుల అధికారులతోపాటు ఎన్‌హెచ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతలపై సమీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, ఎంవీఐ విజయకుమారి, ఏఈఈలు రఘు, ప్రసన్నయాదవ్‌లు పాల్గొన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

కలికిరి, మార్చి 27: మండలంలోని పత్తేగడ పంచాయతీ పాలెం గ్రామం నుంచి కలికిరి పోలీసులు ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. మోహన్ బుధవారం ఉదయం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాల్లో జరిపిన సోదాల్లో ఒక నాటు తుపాకీ లభించినట్లు ఆయన తెలిపారు. ఊరు బయట వరిగడ్డి వామిలో ఈ తుపాకీని దాచి పెట్టగా కనుగొని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు మక్కినేని రమణకు చెందినదిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్ చెప్పారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

పెద్దతిప్పసముద్రం మార్చి 27 : మండలంలోని మల్లెల ఏటిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బూర్లపల్లెకు చెందిన సర్పంచ్ సుబ్బిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పీటీఎం పోలీసులు తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా మల్లెల గ్రామం అంకిరెడ్డిపల్లె సమీపంలోని ఏటిలో నుంచి ఇసుకను తరలిస్తుండగా మొలకలచెరువు ఎస్ఈబీ సీఐ రామ్మోహన్ దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పీటీఎం పోలీసులకు అప్పగించి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

బి. కొత్తకోట, మార్చి27:బి కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లికి చెందిన వివాహిత భువనేశ్వరి(19) అదృశ్యం అయిందని సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆమె తల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమెన్‌మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. అదే విధంగా బి. కొత్తకోట బీసీ కాలనీలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న షేక్ అలీసాబ్(55)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 1.08 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

టెంపో ఢీకొన్న ప్రమాదంలో అన్నదమ్ములకు తీవ్రగాయాలు



క్షతగాత్రులు ఇమ్మానుయేల్, రాజు

కురబలకోట, మార్చి 27: టెంపో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో అన్నదమ్ములకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో జరిగింది. పీటీఎం మండలం రాపూరివాం డ్లపల్లె పంచాయతీ ఉప్పరోళ్ళపల్లెకు చెందిన అన్నదమ్ములు ఇమ్మానుయేల్(37), రాజు(34)లు సొంత పనుల నిమిత్తం మదనపల్లె మండలం సీటీఎం వచ్చి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని కురబలకోట మండలం కంటేవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న టెంపో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె టౌన్, మార్చి 27: మదనపల్లె ఎస్పీడీసీఎల్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీడీసీఎల్ ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈగా పనిచేసిన యుగంధర్‌ను విద్యుత్‌బోర్డు సర్వీసు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పుంగనూరు డివిజన్ ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తిని మదనపల్లె ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. దీంతో బాధ్యతలు చేపట్టిన ఈఈని ఏడీఈ, ఏఈలు విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు శేషాద్రి నాగరాజు, రఘు మర్యాదపూర్వకంగా కలిసి అభినందిచారు.

పీటీఎం 'ఆదర్శ' పాఠశాల

- 6వ తరగతి లో ప్రవేశానికిశానికి దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 దరఖాస్తులకు చివరి గడువు



పీటీఎం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమారి

పెద్దతిప్పసముద్రం మార్చి 27 : పీటీఎం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లీష్ భాషపై పట్టు తప్పనిసరి. గత 14 సంవత్సరాల క్రితమే పూర్తి స్థాయి ఇంగ్లీష్ మీడియం బోధనలో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌లు నేడు అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించడంతో పాటు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న బోజన వసతి కల్పిస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహాలో హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం గ్రామీణాపేద విద్యార్థులకు వరంగా మారుతోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంసెట్, నీట్, ట్రిపుల్ ఐటీలల్లో సీట్లు సాధిస్తూ తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. ఇంగ్లీష్ మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న ఈ పాఠశాలల్లో అడ్మిషన్ పొందడం గగనంగా మారుతోంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలో ఈ స్థాయిలో విద్యను అభ్యసించడానికి ప్రైవేటు పాఠశాలల్లో లక్షలాది రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఈ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతలు ఓసీ, బీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 వ తేదీ నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01/09/2010 సెప్టెంబరు 1వ తేదీ నుంచి నుంచి ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. సంబంధిత జిల్లాలో ఏదేని ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022- 23, 2023- 24 విద్యా సంవత్సరంలో చదివి 2023 - 24 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ అర్హత కలిగి ఉండాలి. పరీక్ష పీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 75, ఓసీ, బీసీ విద్యార్థులకు 150 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంద న్నారు. 5వ తరగతి స్థాయిలో అబ్జెక్టికల్ విధానంలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇందులో ఓసీ విద్యార్థులు, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 కనీస మార్కులుగా నిర్ణయించారు. పరీక్షలు ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయి.

ఆహ్లాదకర వాతావరణం: పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్యాబోదన, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. గ్రంథాలయం, ఆధునిక సౌకర్యాలు, పరికరాలతో కూడిన సైన్స్‌ల్యాబ్‌లు, ఎల్ఈడీ ప్రొజెక్టర్‌తో విద్యాబోధన, డిజిటల్ విద్యాబోధనకు అవకాశం ఉంది. 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు ఆదర్శ పాఠశాల ప్రత్యేకం. ఇప్పటికే పాఠశాలలో ప్రవేశాల కోసం పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం కల్పిస్తున్నారు.

నూతన టెక్నాలజీపై ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న టీసీఎస్ రీజనల్ మేనేజర్ రిచర్డ్ కింగ్

కురబలకోట, మార్చి 27: నూతన టెక్నాలజీపై ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని టీసీఎస్ రీజనల్ మేనేజర్ రిచర్డ్ కింగ్ పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఈ రంగంలో రాణిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చన్నారు. ఇందు కోసం విద్యార్థులు ప్రధానంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతో పాటుగా టెక్నాలజీలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి చొక్కానాథమ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూను సక్రమంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీవైఈవో శ్రీరాంపురుషోత్తం

నిమ్మనపల్లి, మార్చి 27: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూను సక్రమంగా అమలు చేయాలని డీవైఈవో శ్రీరాంపురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంట గదిలో ఉన్న సరుకులను వంటను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారమే బోజనం వడ్డించాలన్నారు. అనతరం స్థానిక జడ్పీ హైస్కూల్ జరుగుతున్న 10వతరగతి పరీక్షలను తనిఖీ చేసి ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను రాయాలని విద్యార్థులకు తెలిపారు.

విజయంలో కీలక పాత్ర పోషించాలి

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 27: జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజక వర్గ అభ్యర్థి విజయానికి కీలక పాత్ర పోషించాలని మాజీ సీఎం చంద్రబాబు రైల్వేకోడూరు సీనియర్ నాయకుడు విశ్వనాథ నాయుడును ఆదేశించారు. బుధవారం చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించిన ప్రజాగళం కార్య క్రమంలో చంద్రబాబును ఆయన కలిసి రాజకీయ స్థితిగతులపై చర్చించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, వాణిజ్య విభాగం కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయాలనే వచ్చాను

చిట్వేలి, మార్చి 27: ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని రైల్వేకోడూరు జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిట్వేలిలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను వైసీపీ నాయకులు కోవర్టు అనే మెస్సేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళుతున్నారని, తాను ఏ పార్టీకి కోవర్టు కాదన్నారు. తనపై బురదజల్లే ప్రయత్నాన్ని మానుకోవాలని ఆయన హెచ్చరించారు. రైల్వేకోడూరుకు మంచి చేయాలని ఉద్దేశ్యంతో తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ తనకు అవకాశం ఇచ్చారని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాదినేని నరేష్‌బాబు, గంధంశెట్టి దినకర్, ఎన్.దాశరథి, మర్రిరెడ్డి ప్రసాద్, గంధంశెట్టి కిషోర్, పగడాల రఘు, రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యనాయుడు, శివ, చక్రి, సుబ్బు, వెంకటేష్, జనసైనికులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఆలయ ధర్మకర్తలు

రాజంపేట, మార్చి 27: రాజంపేట డీఎస్పీ చైతన్యను జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగిరిపాడు ఆలయ ధర్మకర్తలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 28 నుంచి వచ్చే నెల 7వ తేది వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు శాంతిభద్రతల దృష్ట్యా సహకరించాలని తెలిపారు. ఉత్సవాలకు డీఎస్పీని ఆహ్వానించారు. బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రతులను చూసి రంగనాయకస్వామి ఆలయ ప్రతిష్టను తెలుసుకోవాలని కోరారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ శాంతి ప్రవచనాలు, ఉంటాయని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, నరసరామయ్య పాల్గొన్నారు.

మండల సమావేశంలో కోడ్ ఉల్లంఘన

- అధికారుల సాక్షిగా సభ్యుల ఘర్షణ
- సమావేశానికి భార్యల స్థానంలో భర్తలు హాజరు



పోడియం వద్ద ఘర్షణకు దిగిన సర్పంచులు, ఎంపీటీసీలు

నిమ్మనపల్లి, మార్చి 27: ఎన్నికల కోడ్ ఉన్నందున అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశంలో సభ్యులు చర్చించ వద్దని అధికారులు తెలిపినా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గొడవకు దిగిన సంఘటన మండలంలో చోటు చేసికొంది. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో శాలెట్ నిర్వహించారు. సభ్యుల వద్ద నుంచి కేవలం సంతకాలు తీసుకొని సభ నిర్వహించి సమస్యలపై మాట్లాడక పోవడంపై రాచవేటివారిపల్లి వైసీపీ సర్పంచ్ సుబ్రయణ్యం అధికారులను నిలదీశారు. ఎంపీటీసీలు రాకుండానే సమావేశాలు నిర్వహిస్తూ మండల గ్రాంటు కూడా ఎంపీటీసీలకు కేటాయించడంపై ఎంపీపీ నరసింహులను నిలదీశారు. దీంతో పోడియం వద్దకు వెళ్లి ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సామకోటవారిపల్లి సర్పంచ్ మహదేవరెడ్డి మాట్లాడుతూ కేవలం కొంత మంది వైసీపీ నాయకులు స్వార్థరాజయాలను చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారిని దీని ద్వారా పంచాయతీల అభివృద్ధి సాధ్యంకాలేదన్నారు. ఇది ఇలా వుండగా సర్పంచులుగా భార్యల స్థానంలో భర్తలు సమావేశానికి రావడం చర్చనీయాశంగా మారింది. జడ్పీటీసీ ప్రమీలమ్మకు బదులుగా ఆమె భర్త వెంకటరమణారెడ్డి సమావేశాని హాజరయ్యారు. ఇంత జరుగుతున్నా మండల అధికారులు తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీవో శాలెట్‌లు మాత్రం ఏమి తెలియనట్లు మిన్నకుండి పోయారు. మంగళవారం ఉమ్మడి టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా చిన్నసాటి సమావేశం జరగనీయకుండా ఎంపీడీవో శాలెట్ అక్కడే కూర్చోని సమావేశం అడ్డుకోవడంతో దీన్ని బట్టి చూస్తే అధికారులు వైసీపీకి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారోనని పలువురు చర్చికోవడం విశేషం.

ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు



వీఎస్ఆర్ రవి అధ్యక్షుడు
అజయ్ ప్రధాన కార్యదర్శి

పీలేరు, మార్చి 27: పీలేరులో బుధవారం ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా నాగప్పగారి మదన్‌మోహన్ రెడ్డి, అధ్యక్షు డిగా వీఎస్ఆర్ రవి, ప్రధాన కార్యదర్శిగా అజయ్ కుమార్, కోశాధికారిగా ఎర్రబెల్లి మల్లిఖార్జున, ఉపకార్యదర్శులుగా యాదల్ల సాంబశివ, ఆవుల వెంకటరమణ, కార్యనిర్వాహక సభ్యులుగా చిన్నికృష్ణ, దేవల వెంకటరమణ, కృష్ణయ్య, జయచంద్ర, ఆదినారాయణ, బత్తల ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ రవీ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఉన్న ట్రాక్టర్ రవాణా రంగంలోని వారు అనేక సమస్యలతో బాధపడు తున్నారని, వాటన్నింటి పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : ఆర్డీఓ



తాగునీటి సమస్యపై అధికారులు, సిబ్బందితో ఆరాతీస్తున్న ఆర్డీఓ

సుండుపల్లె, మార్చి 27: మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు తెలిపారు. బుధవారం సుండుపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. 14 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్యలపై ఆరాతీశారు. ఏ గ్రామ పంచాయతీలో ఎక్కడక్కడ తాగునీరు సమస్య ఉందో తెలుసుకొని గురువారం ఉదయం నుంచి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని ఆదేశించారు. మాచిరెడ్డిగారిపల్లె, ఉడంపాడు, సొంటంవారిపల్లె, బాగంపల్లె, తిమ్మసముద్రం, చిన్నగొల్లపల్లె, జి.రెడ్డివారిపల్లెతో పాటు పలు గ్రామాల్లో తాగునీటి సమస్యను గురించామన్నారు. సమస్య ఉన్న ప్రాంతాలలో రోజుకు 36 ట్యాంకర్ల తాగునీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జెరీనాబేగం, ఎంపీడీఓ అమరనాథ, ఎంఈఓ రవినాయక్, సర్వేయర్ రక్షిత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలి

ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొనేలా ఏర్పాటు చేయాలని బుధవారం రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. రాజంపేటలో బాధ్యతలు చేపట్టి మొదటిసారి సుండుపల్లెకు రావడంతో తహసీల్దార్ జెరీనాబేగం, రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నిర్వాహణపై పలు సూచనలు, సలహాలను ఆయన తెలియజేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వృద్ధులు, వికలాంగుల బూతుల్లోకి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలిం గ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు కొత్తగా ఓటర్‌కార్డు పొందిన యువకులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులు..!

- టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ధ్వజం

కలకడ, మార్చి 27:వైసీపీకి స్థానిక పోలీసులు కొమ్ముకాస్తున్నారని టీడీపీ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. బుదవారం కలకడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల వేళ నేరారోపణ కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లును పోలీసులు బైండోవర్ చేయడం సాధారణమే అన్నారు. మండలంలో ఇందుకు విరుద్ధంగా గ్రామాల వారి వైసీపీ నాయకుల స్క్రిప్టును పోలీసులు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా అమాయక ప్రజలు, టీడీపీ సానుభూతి పరులను బైండోవర్ చేస్తునారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా వారి దిన పనులకు ఆటంకం కలిగేలా గంటల తరబడి స్టేషన్‌లో ఉంచి మానసిక వేదనకు గురి చేస్తున్నారని విమర్శించారు. పోలీస్ వ్యవస్థపై తనకు అపార గౌరవముందని, ఇకనైనా పక్షపాత ధోరణి వదలి న్యాయబద్ధంగా పని చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

14 వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు



ఓటు నమోదుపై ప్రిన్సిపాళ్లకు సూచనలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి

మదనపల్లె టౌన్, మార్చి 27: ఎన్నికల నామినేషన్లు మొదలు కాక ముందు వర కు(ఏప్రిల్ 14వ తేదీ) 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోచ్చని మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సబ్‌కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, మూడు మండలాల ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన ఓటర్లతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు మాత్రమే ఇంకా 21 రోజులు గడువు ఉందన్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు విని యోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్ రెడ్డి, పద్మావతి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి



అగ్రహారం గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ మోహన్ రెడ్డి

పీలేరు, మార్చి 27: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బుధవారం ఆయన సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి మండలంలోని దొడ్డిపల్లె, అగ్రహారం, ఎర్రగుంటపల్లె పంచాయతీల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల సమయంలో గ్రామస్థులు సంయమనం పాటించి వ్యక్తిగత దూషణలు, ఆధిపత్య ధోరణిని వీడాలన్నా రు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఇబ్బంది కలిగినా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, ఏఎస్ఐ హేమసుందర్ జెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

పెద్దమండ్యం, మార్చి 27: గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీవో వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్ పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి పథకం బోర్ల ద్వారా నిర్ణీత వేళల్లో నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ రెండు నెలల పాటు ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్నికల కోడ్, ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బి. కొత్తకోట సరిహద్దులో రూ.3లక్షల నగదు సీజ్

బి. కొత్తకోట, మార్చి27: బి. కొత్తకోట మండల పరిధిలోని రానామిట్ట చెక్‌పోస్టు వద్ద రూ.3 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్‌చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి బి. కొత్తకోట వైపు వస్తున్న ఓ కారులో సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి రూ.3లక్షలు నగదు తీసుకొస్తున్నాడని అందుకు సంబంధించి సదరు వ్యక్తి ఎటువంటి బిల్లులు చూపకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకొని ఆర్‌వో ఆదేశాల మేరకు రాయచోటిలోని ట్రెజరీలో జమచేయడం జరిగిందన్నారు. పట్టణంలో వివిధ పాతకేసులలో నిందితులైన 10మందిని డిప్యూటీ తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

మైనారిటీలను పావులుగా వాడుకుంటున్న పార్టీలు

- మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రెడ్డిసాహెబ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎస్. రెడ్డిసాహేబ్

మదనపల్లె అర్బన్ మార్చి 27 : మదనపల్లె కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీలు మైనారిటీలను ఎన్నికల్లో పావులుగా వాడుకుంటున్నాయని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్. రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల మనోబావాల ను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన పరోక్షంగా కేంద్రం అమలు చేస్తున్న చట్టాలకు మద్దతు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, రూరల్ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఆయేషా, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు చలపతి, సమీర్, పాలేటి, మహబూబ్‌పీర్, సీనియర్ నాయకులు మస్తాన్, అమీర్‌జాన్, మహమ్మద్, నాగరాజు, శరత్‌కుమార్ రెడ్డి, అన్వర్, సయ్యద్, ఖాసీం, సోను, విజయకుమార్, షమి, రిజ్వానా, ప్రమీల పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సమీరుద్దీన్

గుర్రంకొండ, మార్చి 27:గుర్రంకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ సమీరుద్దీన్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాబక్షు బుధవారం నియామక పత్రాలను అందజేశారు. గుర్రంకొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో పర్యటించి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సమీరుద్దీన్ తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

ములకలచెరువు, మార్చి 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్పలు ఆరోపించారు. రాజ్యాంగ హక్కులను మంటగలుపుతున్న బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోని ప్రజానికం పెరిగిన నిత్యావసర ధరలు, పన్నుల భారం, పెట్రో ధరలు, వంట గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, మండల కార్యదర్శి అంజనప్ప, కార్యవర్గ సభ్యులు నరసింహులు, భాస్కర్, కుమార్, జయకర్, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న కలికిరికి కిరణ్‌కుమార్ రెడ్డి రాక

కలికిరి, మార్చి 27: మాజీ సీఎం, బీజేపీ రాజంపేట పార్లమెంటు ఉమ్మడి కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఈనెల 30(శనివారం)న కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం విడుదల చేసిన పర్యటన వివరాలకు సంబంధించిన ప్రకటనను బుధవారం పత్రికలకు విడుదల చేశారు. 30న ఉదయం బెంగుళూరు నుంచి బయలు దేరి 11 గంటలకు మదనపల్లె చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ మదనపల్లె పట్టణంలో రోడ్ షోలో పాల్గొంటారని మధ్యాహ్నం ఒంటి గంటకు మదనపల్లె నుంచి కలికిరి రానున్నారన్నారు. రాత్రి కలికిరిలోనే బస చేస్తారని కృష్ణప్ప వివరించారు.